

అందోల్: జోగిపేటలో పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

## పోలియో రహిత సమాజానికి కృషిచేద్దాం

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**జోగిపేటలో పిల్లలకు పోలియో చుక్కలు వేసిన మంత్రి**

అందోల్, మార్చి 3: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యారోగ్య, సైన్స్, టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేట ప్రభుత్వ దవాఖానలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి, పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేండ్ల లోపు చిన్నారులకు పోలియోచుక్కలు వేయించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది రెండు రోజులు అన్ని గ్రామాల్లో పోలియో చుక్కలు వేస్తారని, వారి సేవలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం దవాఖానలో కొత్త అంబులెన్స్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, సూపరింటెండెంట్ రమేశ్, ఆర్డీవో పాండు, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పోలియోను పూర్తిగా నియంత్రిద్దాం

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 3: పోలియోను పూర్తిగా నియంత్రిద్దామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయ ఆవరణలో పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులకు తల్లిదండ్రులు పోలియో చుక్కల మందు వేయించాలన్నారు. మన దేశంనుంచి పోలియో పూర్తిగా కనుమరుగైతేనే ఆరోగ్యకర భారత్ సాధ్యమైన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి మల్లన్న స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



బోనంతో మహిళా భక్తురాలు

# కోటికోటి దండాలు కొమురెల్లి మల్లన్న



కొమురవెల్లి ఆలయం రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

**వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు**

**ఏడో వారానికి భారీగా తరలివచ్చిన భక్తులు**

**ప్రత్యేక పూజలు చేసిన మొక్కులు తీర్చుకున్న భక్తజనం**

చేర్యాల, మార్చి 3: వేలాదిగా భక్తులు తరలిరావడంతో సిద్దిపేట జిల్లాలోని కొమురవల్లి మల్లికార్జున స్వామి ఆలయం భక్తజన సంద్రమైంది. బ్రహ్మోత్సవాల ఏడో ఆదివారానికి కరీంనగర్, వరంగల్, మెదక్, హైదరాబాద్ తదితర పాత జిల్లాల నుంచి 25వేల మంది భక్తులు తరలివచ్చారు. ప్రైవేట్ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో భక్తులు భారీగా రావడంతో పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. శనివారం రాత్రి నుంచే మొదలైన భక్తుల రాకా ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి, స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది భక్తులకు సేవలందించారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం ఉండడంతో ఆలయం వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు.



బోనం తయారు చేసి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కరెంటు పోవడంతో చీకట్లో మల్లన్న భక్తులు

### భక్తులకు తప్పని కరెంటు తిప్పలు...

కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులు ఆదివారం వేకువజామున చిమ్మచీకట్లో మగ్గారు. ఉదయం 5గంటలకు కరెంటు సరఫరా నిలిచిపోవడంతో క్యూలైన్లు, గర్భగుడి, గంగరేగు చెట్టు తదితర ప్రదేశాల్లో చీకటి అలుముకున్నది. దీంతో భక్తులు ఇబ్బందికి గురయ్యారు. 15 నిమిషాల పాటు కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కరెంట్ పోతే ఆటోమేటిక్‌గా స్టార్ట్ అయ్యే ఆధునిక టెక్నాలజీ కలిగిన జనరేటర్, దాని నిర్వహణ కోసం ఆలయ ఉద్యోగి, ఇద్దరు వలంటీర్లు ఉన్నప్పటికీ మల్లన్న భక్తులు చిమ్మ చీకట్లో మగ్గడం తప్పలేదు.

## సర్కారు కొలువు సాధించారు

**గురుకుల నియామకాల్లో ఉద్యోగాలు సొంతం**

**తారా కళాశాల నుంచి నలుగురు ఎంపిక**

**నేడు నియామక పత్రాలు అందుకోనున్న అభ్యర్థులు**

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 3: బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో 2023 ఆగస్టులో గురుకుల బోర్డు నిర్వహించిన నియామక పరీక్షల ఫలితాలు ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. జిల్లా కేంద్రంలోని తారా ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, తాత్కాలిక అధ్యాపకులు గురుకుల విద్యాలయాల్లో టీజీటీ, జూనియర్ లెక్చరర్ (జేఎల్), డిగ్రీ లెక్చరర్(డీఎల్) పోస్టులకు ఎంపికయ్యారు.



**కష్టపడ్డాను.. సాధించాను..**

జీవితంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించాను. ఈ క్రమంలోనే తారా ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న, గతేడాది ఉద్యోగం మానేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. కాస్త ఆలస్యంగా సెట్ అర్హత సాధించినప్పటికీ డీఎల్ పోస్టుకు దూరమయ్యాను. నిరాశ చెందకుండా టీజీటీ పోస్టును ఓపెన్ కేటగిరీలో సాధించినందుకు సంతోషంగా ఉంది.

– డి.శ్రావణ కీర్తి, గణితం, టీజీటీకి ఎంపిక



**కల నెరవేరింది**

ఎన్నోసార్లు చివరి అంచుల్లో ఉద్యోగాలను కోల్పోయాను. 2014 నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న నాకు సెట్ అర్హత ఉన్నప్పటికీ కేవలం 20 రోజుల సర్టిఫికెట్ గ్యాప్‌తో గత రెగ్యులరైజేషన్‌లో అవకాశం కోల్పోయాను. అదే పట్టుదలతో కృషిచేసి గురుకుల విద్యాలయాల్లో డిగ్రీ లెక్చరర్ పోస్ట్ సాధించా. చాలా సంతోషంగా ఉంది. నా కష్టానికి ఫలితం దక్కింది. ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం సాధించాను. నా కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది.

– వినోద, హిస్టరీ, డీఎల్‌కు ఎంపిక

**రెండు ఉద్యోగాలతో నాన్న కండ్లల్లో ఆనందం..**



మాది సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామం. కష్టపడి చదువుకున్నాను. మా నాన్న పరశురాములు సెంట్రింగ్ మేస్త్రీ, అమ్మ పద్మ రజక వృత్తి చే స్తూ నన్ను చదివించారు. రజక వృత్తి అయినప్పటికీ తమ పిల్లలు ఉన్నతంగా ఎదగాలనేది మానాన్న కల. వారి కలను నిజం చేయాలనే సంకల్పంతో తారా ప్రభుత్వ కళాశాలలో 2017 నుంచి అతిథి అధ్యాపకునిగా చేరాను. పేద కుటుంబం నుంచి వచ్చిన నేను ఆర్థికంగా నిలదొక్కుకోవడం కష్టంగా మారిన నేపథ్యంలో గురుకుల నియామకాల కోసం గట్టిగా కష్టపడ్డాను. నా డిగ్రీ గురువు పెద్ద బోయిన కుమార్ ప్రేరణతో కష్టపడి టీజీటీ, జేఎల్ పోస్టులు సాధించా. నన్ను ఈ స్థాయికి చేర్చిన నా కుటుంబం, అధ్యాపకులందరికీ కృతజ్ఞతలు.

– ఎం. రాజు, బాటనీ, టీజీటీ, జేఎల్‌కు ఎంపిక

**గురుకులంలో బోధించే అవకాశం వచ్చింది**

పదేండ్లుగా తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకునిగా బోధిస్తున్న నాకు ఇప్పుడు గురుకులంలో బోధించే అవకాశం వచ్చింది. 2014 నుంచి తారా కళాశాలలో గణిత విభాగంలో విధులు నిర్వహిస్తున్నా. ఇటీవల జరిగిన క్రమబద్ధకరణలో భాగంగా కొంతమందికి మాత్రమే ఆ అవకాశం లభించింది. అంతటితో నిరాశ చెందకుండా నా ప్రతిభను నమ్ముకొని గురుకుల పోటీ పరీక్షలకు హాజరయ్యాను. జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– పి.లింగస్వామి, గణితం, జేఎల్‌కు ఎంపిక



## మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

మద్దూరు (ధూళిమిట్ట), మార్చి 3: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన గుండ్రెడ్డి వెంకటమ్మ, వీరనర్సింహారెడ్డి దంపతుల కుమారుడు గుండ్రెడ్డి మహిపాల్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. కామర్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగంతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగాలను సాధించాడు. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే మహిపాల్‌రెడ్డి పలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. తనకు ఇష్టమైన ఉద్యోగం జూనియర్ లెక్చరర్ అని, మూడు ఉద్యోగాల్లో నుంచి జూనియర్ లెక్చరర్‌గా చేరతానని తెలిపాడు. మహిపాల్‌రెడ్డిని గ్రామస్తులు, బంధువులు, కుటుంబసభ్యులు అభినందించారు.

## ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ సర్కారు

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



నర్సాపూర్ ఏరియా దవాఖానలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 3: ప్రజలను తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ ఏరియా దవాఖానలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి, చిన్నారులకు చుక్కల మందు వేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీది రాజకీయం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో సాగు, తాగునీటి ఇబ్బంది ఎక్కడా తలెత్తలేదన్నారు. ఇది కేసీఆర్ సమర్థ నాయకత్వం వల్లే సాధ్యమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వృథా అని కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేయడం తగదని తెలిపారు. ఎండకాలంలో హల్దీ వాగుపై 9 చెక్‌డ్యామ్‌లు నింపడం కేసీఆర్ విజయం కాదా అని ప్రశ్నించారు. వానకాలం సమీపించే లోపు మేడిగడ్డ బ్యారేజ్‌ను రిపేర్ చేయించాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలుకు కొర్రీలు పెడుతూ కాంగ్రెస్ సర్కారు ప్రజలను మోసం చేస్తున్నదని సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ లలిత, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, తొంట వెంకట్, నగేశ్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపీ అభ్యర్థిత్వానికి మద్దతివ్వండి



బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీరయ్యయాదవ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 3: మెదక్ పార్లమెంట్ స్థానం అభ్యర్థిత్వానికి తనకు మద్దతివ్వాలని బీఆర్‌ఎస్ నాయకుడు, బీసీ సంఘం నేత బీరయ్య యాదవ్ బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డిని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. మలివిడత తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెన్నంటి నడిచానని, ఉద్యమ సమయంలో లాఠీ దెబ్బలు తిన్నానని, సమైక్య పాలనలో తనపై అనేక కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ బలోపేతానికి విశేషంగా కృషిచేశానని, మెదక్ ఎంపీ అభ్యర్థిత్వానికి తనకు మద్దతు తెలుపాలని పద్మాదేవేందర్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఏడుపాయల దుర్గమ్మకు దండాలు

పాపన్నపేట, మార్చి 3: మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా భవానీమాత ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. కుంకుమార్చనలు నిర్వహించారు.తలనీలాలు, బోనాలు సమర్పించారు. ఏడుపాయల ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి,రవివీర్ కుమార్, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్ ప్రత్యేక పూజలు చేశారు. పాపన్నపేట ఎస్సై నరేశ్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.





క్యూలైన్లో భక్తుల సందడి, ఇన్‌సెట్లో పూజలు అందుకుంటున్న వనదుర్గా భవానీ మాత

## 'మున్సిపల్ నూతన భవనాన్ని సిద్ధం చేయండి'

రామచంద్రాపురం, మార్చి 3: తెల్లాపూర్‌లో మున్సిపల్ భవన నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. తెల్లాపూర్‌లో రూ.8.40 కోట్లతో అధునాతన సౌకర్యాలతో మున్సిపల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లలితా సోమిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులతో చర్చించారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి సూచించారు. మున్సిపల్ భవనం పక్కనే నిర్మాణ దశలో ఉన్న సమీకృత మార్కెట్, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు బాబ్జీ, రాజు, శ్రీశైలం, లచ్చిరాం, రవీందర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌యాదవ్, మల్లారెడ్డి, ఉమేశ్, బుచ్చిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, కొమురయ్య, సాగర్, ఇంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహ, పాండు, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, విష్ణు, నర్సింలు, అధికారులు తదితరులు ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## ప్రధాని సభకు భారీ ఏర్పాట్లు



ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగసభ వేదికను ముస్తాబు చేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు, మార్చి 3: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 5న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభలో ప్రధాని పాల్గొనున్నారు. పటాన్‌చెరు పట్టణం, పటేల్‌గూడ మధ్య సభకు వేదికను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం జరిగే భారీ బహిరంగ సభ కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద వేదికపై డిజిటల్ తెరలను అమర్చుతున్నారు. ప్రజలు నీడలో ఉండేలా భారీ షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. హెలీపాడ్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే భద్రతా దళాల హెలికాప్టర్ ట్రయల్స్ వేసింది. వేదిక వరకు హెలిప్యాడ్ నుంచి బీటీ రోడ్డును వేస్తున్నారు. ప్రధాని భద్రతా వ్యవహారాలు చూసే కేంద్ర భద్రత బలగాలు వేదిక వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేస్తూ, పరిశీలిస్తున్నాయి. వేదిక చుట్టూ బారికేడ్లు అడ్డంగా పెడుతున్నారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని పట్టణాలు, గ్రామాల నుంచి సభకు జన సమీకరణకు బీజేపీ నాయకులు సమాయత్తం అవుతున్నారు. బీజేపీలో చేరిన సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రధాని సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.